# కోరికలు వర్సెస్ అవసరాలు

బి.హరిప్రియ ఉషారాణి




"ఏంటి, యింకా నిద్రపోకుండా ఏమాలోచిస్తున్నారు?" మంచంపైన పడుకొని యింటి పైకప్పు వంక తదేకంగా చూస్తున్న భర్తను అడిగింది అప్పుడే సినిమా అయిపోవడంతో టి.వి.కట్టేసి వచ్చిన సుజాత.

ప్రతిరోజూ పదకొండు గంటలకే నిద్రపోయే ఆనందరావుకు ఆరోజు పన్నెండు గంటలు దాటుతున్నా నిద్రపట్టలేదు.

"ఏమీలేదు ఇవాళ ఆఫీస్‌లో పని త్వరగా అయిపోయింది. అందుకని యింటికి వచ్చేటప్పుడు దారిలో వున్న లైబ్రరీకి వెళ్ళి అక్కడ ఒక పుస్తకం చదివాను. అందులో-కోరికలనేవి లేకుంటే దుఃఖమనేది వుండదు అని వుంది" అని భార్యవైపు తిరిగి చూశాడు.

ఆమె నిద్రలోనికి జారుకొని వుండడంతో తన మాటలు వినలేదని అర్థమయింది. దాంతో బలవంతంగా నిద్రకు ఉపక్రమించాడు ఆనందరావు.

ఉదయాన్నే నిద్రలేచి చూసేసరికి సమయం ఏడుగంటలు అవుతూ కనిపించగానే "సుజాతా!" అంటూ గావుకేక పెట్టాడు ఆనందరావు. "ఎందుకంత గట్టిగా అరుస్తారు" రుసరుసలాడుతూ చేతిలో గరిటెతో సహా వచ్చింది సుజాత. "టైము ఏడవుతుంటే నన్ను నిద్రలేపాలని తెలీదా. ఐనా యింతసేపు కనీసం టీ అయినా లేకుండా ఏం చేస్తున్నావు. ఇవాళ ఆఫీసుకు అనవసరంగా లేటయ్యేటట్లు ఉంది"

"పిల్లలకు ఇవాళ పరీక్షలని తొందరగా వెళ్ళాలంటే టిఫిను చేస్తున్నాను. మీరు లేచి రెడీ అయిన తరువాత టీ పెడదామని" వెంటనే సమాధానమిచ్చింది సుజాత.

"సరే... సరే... నేను త్వరగా స్నానంచేసి రెడీ అవుతాను" విసుగ్గా అంటూ బాత్‌రూమ్‌లో దూరాడు.

స్నానం పూర్తయిందనిపించి అద్దంముందు చేరి తలదువ్వడం ప్రారంభించగానే నిన్న తాను చదివిన పుస్తకం సంగతి గుర్తుకురావడంతో మరోసారి ఆ వాక్యాలను మననం చేసుకోసాగాడు ఆనందరావు.

'నిజమే. ఉదయాన్నే టీ తాగకపోవడంతో ఎంతో విసుగ్గా అనిపిస్తుంది. దీనికి కారణం టీ తాగాలనే కోరిక. ఆ కోరికే లేకపోతే తనకు యిప్పుడీ తలనొప్పి వుండేది కాదు!' గొప్ప సత్యాన్ని కనుక్కొన్న ఆనందంతో ప్రశాంతంగా వంటగదివైపు అడుగులేశాడు.

"టీ కోసం వచ్చారా! కాసేపు ఆగండి. మీకు మధ్యాహ్నం భోజనానికి కూరలు తయారుచేస్తున్నాను. అవి మరో మూడు నిమిషాల్లో పూర్తవుతాయి. వెంటనే టీ పెడతాను" కంగారుగా చెప్పింది సుజాత.

"మరేమీ పర్వాలేదు. టీ తాగాలనే కోరికే లేకపోతే మనకు వుదయాన్నే తలనొప్పి అనేదే వుండదు కనుక యికనుంచి ముందు ఆ కోరికలే కుండా వుండటానికి ప్రయత్నం ప్రారంభిద్దాం, సరేనా!" అని చెప్పి వెళ్ళాడు.

అర్థంకాకుండా మాట్లాడి వెళుతున్న భర్తవైపు అయోమయంగా చూస్తూ 'కాసేపు ఆలస్యం చేసినందుకు ఈ రకంగా తిట్టాలా, ఏం మనిషో ఏంటో' అని తలపట్టుకొని టీ కోసం గిన్నె స్టవ్ మీద పెట్టింది.

ఆఫీస్‌కు చేరగానే బాస్ తనను అప్పటికే రెండుసార్లు అడిగాడని ప్యూన్ చెప్పడంతో హడావుడిగా ఆయన దగ్గరకు వెళ్ళాడు ఆనందరావు.

"అరగంట లేటుగా వచ్చారేంటి ఆనందరావ్. ఇప్పుడే హెడ్డాఫీస్‌నుంచి కొన్ని ఫైల్స్ వచ్చాయి, అందులోనివన్నీ త్వరగా క్లియర్‌చేసి పంపించమని. వీటినిబట్టే వచ్చే నెలలో ప్రమోషన్‌లు ఎవరికి ఇవ్వాలో నిర్ణయిస్తారు. అది కావాలంటే వీటిని త్వరగా పూర్తిచేయడంతోపాటు ఆఫీస్‌కు తొందరగా రావడం నేర్చుకోండి" నవ్వుతూనే చురకలంటిస్తున్న బాస్ చేతిలోని ఫైల్ తీసుకొని తన కుర్చీలో ఆసీనుడయ్యాడు ఆనందరావు.

మధ్యాహ్నం పది నిముషాలలోనే భోజనాన్ని ముగించి మళ్ళీ వెంటనే పని ప్రారంభించి సాయంత్రం వరకు అందులో నిమగ్నమైపోయాడు.

"సార్ ఏంటి, యింటికి కూడా వెళ్ళరా" ప్యూన్ పిలుపుతో తలపైకెత్తి చుట్టూ చూశాడు ఆనందరావు.

"అరె! అందరూ వెళ్ళిపోయారా, గమనించనే లేదు" అంటూ పైకిలేవబోయి నడుము పట్టుకున్నాడు.

"అయ్యయ్యో నడుము నొప్పా సార్. అనుకుంటూనే వున్నాను. ఉదయం నుంచి సాయంత్రం వరకు అదేపనిగా చేస్తున్నారు. కనీసం మధ్యలో టీ కూడా తీసుకోలేదు. మీతోపాటు ప్రమోషన్ కోసం రేసులో వుండే చలపతి, శ్రీనివాస్‌లు ఎప్పుడో వెళ్ళిపోయారు" అన్నాడు ప్యూన్ జాలిగా మొహంపెట్టి.

"ఏం చేస్తాం. వాళ్ళు చేసే పని తక్కువ. బాస్ దగ్గర మాటలెక్కువ. నాకు అవి చేతకాదు. కనుక పనితోనే ఆయన్ని ఆకట్టుకోవాలి" అంటూ భారంగా అక్కడి నుంచి కదిలాడు.

ప్రమోషన్ విషయం ఆలోచిస్తూ యింటికి వెళుతున్న ఆనందరావు వున్నట్లుండి ఒక నిర్ణయానికి వచ్చి స్వీట్ ప్యాకెట్‌కొని దానితో యింటికి చేరుకున్నాడు.

"ప్రమోషన్ వచ్చిందా?" ఆనందంగా భర్తచేతిలోని స్వీట్ ప్యాకెట్‌ను తీసుకుంటూ అడిగింది సుజాత.

"అదేమీ లేదు. ముందు ప్రశాంతంగా కూర్చో" అంటూ భార్యను తన ప్రక్కనే సోఫాలో కూర్చోబెట్టుకున్నాడు.

అంతలోనే ఫోన్ రింగవడంతో రిసీవర్ చేతిలోకి తీసుకున్నాడు ఆనందరావు. అతని చిన్నాన్న కొడుకైన సుధాకర్ మాట్లాడుతున్నాడు. అతను ఎరువుల వ్యాపారి. ఇంకా అనేకరకాల వ్యాపారాలు చేసి లక్షలు గడించాడు. ఇప్పుడు ఆ దబ్బు పెట్టుబడిగా పెట్టి స్థలాలుకొని, అమ్మాలనే ఆలోచనలతో ఆనందరావును పలకరించాడు.

"చెప్పు ఆనందం. ఇప్పుడు మనం పెట్టే పెట్టుబడి రేపు పదింతల లాభంతో మనకు వస్తుందంటావా?" సుధాకర్ ప్రశ్నకు ఒక నిమిషం మౌనం వహించాడు ఆనందరావు.

ఏం చెప్పాలా అని ఆలోచిస్తున్న అతనికి మళ్ళీ తనలోని ఆత్మారాముడు గుర్తుకు రాసాగాడు.

"సుధాకర్, కోరికలు దుఃఖానికి కారణాలు. కనుక నువ్వే ఆలోచించుకో" అని వెంటనే సమాధానమిచ్చాడు.


ఆనందరావు సమాధానానికి తాత్కాలికంగా మెదడు స్తంభించిన సుధాకర్ అచేతనంగా ఫోన్ పెట్టేశాడు.

వాళ్ళ సంభాషణ విని అర్థం చేసుకున్న సుజాత భర్తవైపు భయంగా చూసింది.

కానీ అదేమీ పట్టించుకోని ఆనందరావు ప్రేమగా సుజాత చేతిని తన చేతిలోనికి తీసుకొని ఆరోజు ఆఫీస్‌లో జరిగినదంతా చెప్పాడు. "అంతా విన్నావుకదా! నీకు ఏమి అర్థమయింది" అడిగాడు ఆమెను.

"ఏముంది, ఎవరు త్వరగా ఆ ఫైల్‌లు పూర్తి చేసి పంపుతారో వాళ్ళకు ప్రమోషన్ వస్తుంది. మీరు బాగా కష్టపడుతున్నారు కాబట్టి మీకే రావచ్చు" అన్నది.

"కానీ నాకు అర్థం అయింది అది మాత్రమే కాదు. అసలు ప్రమోషన్ అనే కోరికే కదా ఈ నడుంనొప్పికి



కారణం, కాబట్టి ఆ కోరికే లేకపోతే ఈ నొప్పి వుండదు. మనకు పోటీవుండే వాళ్ళను చూసి మనకు టెన్షనూ వుండదు" హితబోధ చేసి వెళ్తున్న భర్తవైపు విభ్రాంతిగా చూస్తూ వుండిపోయింది సుజాత.

ఆరోజు నుంచి ప్రతిరోజూ, ప్రతిపనిలో తాను తెలుసుకున్న జ్ఞానాన్ని గుర్తుకు తెచ్చుకొని దానిని అమలుపరుస్తూ, పాటించమని సలహాలు ఇస్తూ యింటా, బయటా అందరినీ తన ప్రవర్తనతో దిగ్భ్రాంతికి గురిచేయసాగాడు.

"హఠాత్తుగా ఎందుకలా ప్రవర్తిస్తున్నాడు. ఇంతకుముందు నేను కలసినప్పుడు బాగానే వున్నాడే!" సుజాత వంక చూస్తూ అన్నాడు సుందరం.

"అదే నాకూ అంతుచిక్కడం లేదన్నయ్యా! ఏమైందోఏమో! ఏమి కావాలని అడిగినా 'కోరిక లేకపోతే బాధేలేదు' అనేమాట నోట్లోంచి వస్తోంది ఆయనకు. ఇవన్నీ చూస్తూ వుంటే ఈ సంసారం ఏమైపోతుందో అనిపిస్తోంది" కన్నీళ్ళు పెట్టుకుంటూ చెప్పింది సుజాత.

సుందరం, సుజాతకు దూరపుబంధువు. ఆనందరావుకు ఆప్తమిత్రుడు.

"అయ్యో, బాధపడకమ్మా! నేను వున్నాను కదా!" అని ధైర్యం చెప్తూ అప్పుడే వచ్చిన ఆనందరావును ఆప్యాయంగా పలుకరించాడు.

మాట్లాడుకుంటున్న వాళ్ళకు వున్నట్లుండి పిల్లలు గొడవపడుతున్నట్లు అనిపించడంతో అటువైపు చూశారు.

"చూడు నాన్నా, అన్నయ్య ఛానెల్ మార్చమంటే మార్చడం లేదు" తండ్రితో ఫిర్యాదు చేసింది కీర్తి.


"మ్యాచ్ అయిపోయే వరకు డిస్టర్బ్ చేయొద్దని చెప్పు నాన్నా" తనూ తండ్రితో అన్నాడు అభినయ్.

ఇద్దరి ఫిర్యాదులు విని ఒక్కనిమిషం మౌనం వహించిన ఆనందరావు కూతురి దగ్గరకు వచ్చి తలపైన చేతినివుంచి కొడుకువైపు చూస్తూ,

"చూడండీ మీకు అవి చూడాలనే కోరిక లేకపోతే యిప్పుడు గొడవపడుతూ బాధపడాల్సిన అవసరం లేదుకదా చెప్పండి" అనడంతో పిల్లలిద్దరితోపాటు ఆశ్చర్యపోవడం సుందరం వంతైంది.

మరో నిమిషంలోనే కీర్తి కోరిన ఛానెల్‌ను పెట్టి తాను వెంటనే గదిలోనికి వెళ్ళి పుస్తకాలు తీసి చదువుకోసాగాడు అభినయ్.

ఇంకో రెండు నిముషాల్లోనే తాను కూడా అన్నయ్యతోపాటు గదిలోకి వెళ్ళి చదువుకోసాగింది కీర్తి.




అంతా గమనించిన ఆనందరావు ఎంతో ఆనందంగా, స్నానం చేసి వస్తానంటూ లోపలికి వెళ్ళడంతో బొమ్మలా నిర్వేదంగా చూస్తున్న సుజాతవైపు తిరిగాడు సుందరం.

"నాకు పరిస్థితి అర్థం అయింది. నువ్వేమీ కంగారుపడకమ్మా, రేపు సాయంత్రానికి వాడు మామూలు మనిషిగా వుంటాడు" అని భరోసా ఇచ్చి కదిలాడు.

మరునాడు ఆదివారం. ఉదయాన్నే సుందరం నుంచి తమ యింటికి దగ్గర్లోని పార్క్‌కు రమ్మంటూ ఫోన్ రావడంతో వెళ్ళి అతనిని కలిశాడు ఆనందరావ్.


"ఏంటి సుందరం! నిన్న యింటికొచ్చి ఏమీ మాట్లాడకుండా వచ్చేశావు. ఉదయాన్నే రమ్మని ఫోన్ చేశావు" అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు.

"ముందు కూర్చో చెప్తాను" అంటూ ప్రారంభించి తన ప్రణాళికను అమలుచేశాడు సుందరం.

ఆ మరునాడు "సుజాతా, టీ" భర్తపెట్టిన కేక వినిపించి త్వరత్వరగా టీ తీసుకొని వెళ్ళింది సుజాత. భార్యచేతిలోని 'టీ' గ్లాస్ తీసుకుంటూ "ఎందుకలా చూస్తున్నావు. టీ అడిగానని! నిన్ననే మరొక విషయం తెలుసుకున్నాను. అది కోరికలకు, అవసరాలకు మధ్య వున్న వ్యత్యాసం.

కోరికలు అనేవి ఏవైనా మనం కావాలనుకున్నప్పుడు అవి తీరకపోయినా మనకు వచ్చే నష్టం ఏమీ లేదు. కానీ వాటి కోసం అవివేకులు బాధపడతారని అలా చెప్పారు. కాని అవసరాలు మన బ్రతుకు బండిని వేగంగా నడిపి మనకు జీవితంలో అభివృద్ధిని, సంతోషాన్ని ఇస్తాయి. వాటిని కూడా కోరికలనుకొని విస్మరిస్తే అశక్తులుగా మారి, ప్రగతిపథంలో వెనుకబడిపోతాం. వాటికి ఉదాహరణలే మనకి రోజువారీ అలవాట్లై, అవసరాలుగా మారిన 'టీ' అనేవి. మనం ఆర్థికంగా ముందుకెళ్ళడానికి కావలసిన ప్రమోషన్లు" ఇంకా చెప్పబోతున్న ఆనందరావు నోటిపై చేయి వుంచింది సుజాత.

"అర్థం చేసుకొని మీరు మారారు. నాకు అంతేచాలు. అదే నాకు, పిల్లలకు ఎంతో సంతోషకరం" అంటూ మనసులోనే సుందరానికి ధన్యవాదాలు తెలుపుకున్నది సుజాత.



# నేనేంటో నిరూపించుకుంటా

శంకర్ నిర్మించిన 'ప్రేమిస్తే' సినిమాలో హీరోయిన్‌గా పరిచయమైన కేరళ కుట్టి సంధ్యకి ఆరంభంలో అవకాశాలు వెల్లువెత్తాయి. కానీ ఆ తర్వాత ఒక్కసారిగా తారాపథంలో వెనకబడిపోయింది. 'నేను కేవలం మలయాళ చిత్రాలకే ప్రాధాన్యత ఇస్తున్నానుకుంటున్నారు గానీ, మంచి ఆఫర్‌లు వస్తే తమిళ, తెలుగుల్లో నటించడానికి నేనెప్పుడూ రెడీనే' అంటోంది తాజాగా. కెరీర్ తొలినాళ్లలో తెలిసీతెలీనితనంతో కొన్ని తప్పులు చేయడం వల్ల నా కెరీర్‌లో కొంత గ్యాప్ వచ్చింది, అయితే ఇకపై ఎంతో ప్లాన్డ్‌గా ముందడుగు వేస్తున్నాను' అంటోంది.